# తలనొప్పోమీటర్

**తను ఆరోగ్యంగా** ఉంటూ, ఇంటిల్లిపాదినీ ఆరోగ్యంగా ఉంచగలిగే వ్యక్తిని 'ఇల్లాలు' అంటారని పెళ్లికి ముందు నుండీ రాజాకు తెలుసు. అతను టీవీయాడ్స్‌లో చూసాడుగా. ఇల్లాలు అనే మనిషి హార్లిక్స్ తాగి ఎప్పుడూ ఫ్రెష్‌గా ఉంటుంది. ఆటల్లో దెబ్బ తగిలించుకొని వచ్చిన కొడుక్కి అయొడెక్స్ రాస్తుంది. వానలో తడిచివచ్చిన పతిదేవునికి ఛాతీమీద విక్స్ పూస్తుంది. పడుక్కోబోయే ముందు నుదుటిమీద ముద్దు పెడుతుంది కూడా. లోకంలో ఇల్లాళ్లందరూ ఉండగా, తన ఇల్లాలు మాత్రం రోగిష్టి దెందుకయిందో అంతుపట్టలేదు రాజాకి.

అలా అని ఆడవాళ్లకు అస్సలు జబ్బులు రావని అతను అనుకోలేదు. పెళ్లయిన నలభైయేళ్లకు కీళ్లనొప్పుల మందుకి మోడల్‌గా పనిచేసే అర్హత సంపాదించుకొంటారని అతనర్థం చేసుకోగలడు. కానీ పెళ్లయిన నాలుగు నెల్లకే సావిత్రి రోగానికి గురవ్వడం అతనికి మింగుడు పడలేదు. అదీ, ఎటువంటి రోగం? మందుకు లొంగని మహమ్మారి - తలనొప్పి. రావడం కూడా విచిత్రంగా వస్తుంది, ఏ అలసటా లేకపోయినా సరే! వచ్చినది ఓ పట్టాన పోదు. ఒక ప్రత్యేక లక్షణమేమిటంటే తలనొప్పి గురించి సానుభూతి చూపించి, అమృతాంజనం రాసి తగ్గిద్దామని భర్త ప్రయత్నించినకొద్దీ తలనొప్పీ, చికాకూ పెరిగిపోతూంటాయి.

రాజాకు బెంగ పట్టుకుంది, ఈ తలనొప్పిని నిర్లక్ష్యం చేస్తే ఏ నెర్వస్ డిజార్డర్‌కో దారితీస్తుందని, డాక్టరు దగ్గరకు వెళదామని చెప్పి చూసాడు. సావిత్రి వినలేదు. "అదే పోతుంది లెండి." అనేది. ఆ అనడం కూడా ధైర్యం చెబుతున్నట్టో, అనునయంగా అంటున్నట్టో ఉండేది కాదు. 'నా బతుక్కి డాక్టరు దగ్గరకెళ్లడమొక్కటే తక్కువైంది' అన్నంత విసురుగా చెప్పేది.

'రోగ తీవ్రత వల్ల స్థిమితం చెడి అలా మాట్లాడుతున్నావు గానీ ఇలా ఎర్లీ స్టేజెస్‌లోనే త్వరగా వైద్యం చేయించేసుకుంటే మంచిది. ఈ తలనొప్పి బాధ శాశ్వతంగా వదిలిపోతుంది" అని హితవు చెప్పబోయేవాడు రాజా.

కానీ అదేమిటో గానీ ఇలాటి మాటలు కూడా సావిత్రికి చికాకు తెప్పించి, తలనొప్పిని పెంచేవి. ఈ రోగ లక్షణాల గురించి రాజా తనకు కనబడిన వైద్య గ్రంథాలన్నీ చదివిచూసేడు. పత్రికల్లో కనబడిన చిట్కాలు సేకరించి ప్రయోగించబోయేడు. సావిత్రి విసుక్కొనేది. 'తలనొప్పి ఎందుకొస్తోందో తెలీక పోతే ఊరుకోండి. ఈ గచ్చాకు, పుచ్చాకు మందులతో చంపకండి బాబూ, మీకు పుణ్యముంటుంది... అర్థం చేసుకునే మనిషైతేగా..." అంటూ సాగదీసేది.

చివరికి పరిచితుడైన ఒక మందుల షాపతని దగ్గర రాజా మొరపెట్టుకున్నాడు. షాపతను

నవ్వాడు. "భర్తగా ప్రొబేషన్ పూర్తి కాలేదు కాబట్టే నువ్వింత బెంబేలు పడుతున్నావు. నీలాటి వాళ్ల కోసమే ఓ మీటరొకటి తయారుచేశారు. చాలా ఖరీదే గానీ నీ క్కావాలంటే తెప్పించి పెడతాను, సీక్రెట్‌గా. మార్కెట్లో బహిరంగంగా అమ్మి దాని ప్రభావం చెడగొట్టకూడదని అది కనిపెట్టిన సైంటిస్టు ఆంక్ష పెట్టాడు" అన్నాడు.

'పాలమీటరు, థర్మామీటరు లాగ తలనొప్పికి కూడా మీటరుందా? అంటే తలనొప్పి ఎంత తీవ్రంగా ఉందో డిగ్రీల్లో చూపిస్తుందా?"

"ఆహాఁ, దాంతో బాటు షేపంటు మైండు 'రీడ్' చేసి కారణం కూడా చూపిస్తుంది. మెసేజ్ అన్న బటన్ నొక్కితే చాలు. పేజర్లోలా అక్షరాలు వస్తాయి. చెయ్యాల్సిందల్లా దాన్ని నీ భార్య దిండు కింద పెట్టాలి. అయిదు నిమిషాల్లో కారణం తెలిసిపోతుంది."

"భలే బాగుందే, ఎవరు కనిపెట్టారు దీన్ని?"

"సుబ్బారావు భాబా అనే ఆయన. దీన్ని భాబా మీటరు అని కూడా అంటారు."

"హోమిభాభా గారి బంధువులు తెలుగు పేర్లు కూడా పెట్టుకున్నారే" అని ఆశ్చర్యపడ్డాడు రాజా.

"అబ్బే, భాబా ఇంటిపేరు కాదు. పౌరుష నామధేయం. 'భార్యా బాధితుడు' అనే దానికి ఎబ్రివేషన్ అన్నమాట. ఆయన భార్య కూడా తలనొప్పో అని చంపుకుతింటూంటే దీన్ని కనిపెట్టాడాయన. తనలాటి వాళ్లకు ఉపయోగపడుతుందని రహస్యంగా అమ్మిస్తున్నాడు."

భాబా తలనొప్పో మీటరు రాజాకు చాలా ఉపయోగపడింది. మూడు నెలలు తిరక్కుండానే భార్య అనారోగ్యం గురించి అతని చింత తగ్గిపోయింది. ఆమెకు తలనెప్పి ఎందుకు వస్తోందో అతనికి సులభంగా తెలిసిపోతోంది. మొదటిసారి మీటరు మీద కనబడిన మెసేజ్ చదవగానే అతనికి ఆశ్చర్యం వేసింది – 'ఇంత చిన్నదానికి తలనొప్పి తెచ్చుకుంటారా' అని. తర్వాత, తర్వాత అతనికి ఆశ్చర్యం కలగడం మానేసింది. తలనెప్పి అనేది ఏ కారణం చేతనైనా రావచ్చునని అతనికి తెలిసివచ్చింది. ఆ కారణం పైకి చెప్పలేనంత సిల్లీగా ఉండడం వల్లనే తలనొప్పి వస్తుందని కూడా అర్థమయింది. ఆ మీటరు మీద కనబడే డిగ్రీ, మెసేజ్ తరచుగా గమనించగా కారణం ఎంత సిల్లీగా ఉంటే అంత ఎక్కువగా, తీవ్రంగా తలనొప్పి ఉంటుందని కూడా తెలిసింది. అంత సిల్లీ రీజన్‌కే తనకు తలనొప్పి వస్తున్నందుకు చికాకు వల్లనో, అంతకంటే మంచి కారణం దొరకనందుకు దుఃఖం వల్లనో తీవ్రత పెరుగుతోందని గ్రహించుకున్నాడు.

కారణాలు అన్నీ రాసిపెట్టుకుంటే ఎప్పుడెప్పుడు ఏయే సమయాల్లో వేటి వేటి వల్ల తలనొప్పి వస్తోందో ఒక 'పేటర్న్' కనిపెట్టవచ్చునిపించింది అతనికి. అతను నోట్ చేసుకున్న కారణాల్లో కొన్ని –

– 'వంట వండే మూడ్ లేదు. హోటల్ కెళితే బాగుంటుంది. ఈయన హోటల్ ఊసెత్తకుండా తనే వంట చేసి పెడతానంటున్నారు.'

– 'వెళ్లబోయే ఫంక్షన్లో నా కంటే అందగత్తెలున్నారు. ఈయనకది తోచదు. ఫంక్షన్‌కు రమ్మని బలవంతం చేస్తున్నారు.'

– 'ఆయన పేకాట కెళ్లడం నా కిష్టం లేదు. ఇంట్లోనే ఉండి హాయిగా నాతో కబుర్లు చెప్పవచ్చుగా.'

– 'ఇంటికి గెస్టుల్ని పిలవడం శుద్ధ వేస్టు, తలనొప్పి అని పడుక్కొంటే కాఫీతో

సరిపెట్టుకొని పోతారు. లేకపోతే భోజనాలంటూ చంపుకుతింటారు.'

– 'జ్వరం కూడా అని చెబితే ఒంటిమీద చెయ్యి వేస్తారు. అప్పుడు దగ్గరకు లాక్కుంటే సరి. నిన్నటినుంచి ఆయన పట్టిన అలక ఒక్క నిమిషంలో ఎగిరిపోతుంది.'

– 'కారణం ఏమీలేదు, ఏమీ తోచక'

– 'ఏదైనా కొనిపెట్టమని అడిగితే సరి. ఏం కొనమందామో ఇంకా తేల్చుకోలేదు.'

– 'నిజంగా తలనొప్పే, పక్కింటావిడ మంచి చీర కొనుక్కుంది'

క్రమంగా రాజాకు భార్య తలనొప్పి తీరూ, తరహా తెలిసిపోయింది. తనకు ఏ సందర్భాల్లో అది వస్తోందో తెలిసి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోసాగాడు.

పోగాపోగా సావిత్రికి తలనొప్పి తెచ్చుకొనే అవసరమే కనబడడం మానేసింది. అదొక తలనెప్పి అయి కూచుందామెకు. తనలో స్త్రీ లక్షణాలు అంతరించిపోతున్నాయా అన్న భయం పట్టుకుంది. ఇది ఇలా సాగితే భర్తను దారికి తెచ్చుకునే సాధనం చేజారిపోతుందన్న బెంగ పట్టుకుంది. అసలు ఇంత హఠాత్తుగా భర్తకీ తెలివితేటలెక్కడనుంచి వచ్చాయాని అబ్బురపడింది. మెడికల్ షాపతను ఒకతను భర్తకు ఫ్రెండని తెలుసు. అతని దగ్గర 'ఐక్యుప్లస్' లాంటి మందులేవైనా కొనుక్కొన్నాడా?

మందు లేవీ కావన్నాడు మందు షాపతను. ఏదో మీటరు అమ్మేడుట. కావాలంటే తనకీ ఓ మీటరు, భబా మీటరుట, అమ్ముతానన్నాడు – రాజుకు చెప్పకపోతే!

"నాకెందుకు మీటరు?" అంది సావిత్రి.

"మీ వారు కూడా తలనెప్పిగా ఉందని ఇష్టంలేని పనులు ఎగ్గొడుతూంటారుగా. అది నిజమైనదో కాదో మీరు ఇట్టే పట్టేయచ్చు. ఒకటి దగ్గరుంచుకోండి. దొంగవేషాలేస్తే లొంగదీయవచ్చు."

"ఇదేమైనా పనిచేస్తుందంటారా?"

"భలేవారే, భాబా మీటరు కనిపెట్టినాయన భార్యే కనిపెట్టింది. ఇది భబామీటరు, భర్తా బాధితుల మీటరన్నమాట. ఓ వారం పాటు వాడి చూసి నచ్చితేనే డబ్బులివ్వండి లేకపోతే వాపసు చేసేయండి."

అది కొన్న రెండోరోజున సావిత్రి రాజును సినిమాకి తీసుకెళ్లమంది. రాజా తలనెప్పిగా ఉందన్నాడు. ఆస్ప్రిన్ వేసుకుని ఆమె చేత కాఫీ ఇప్పించుకొని తాగి పడుక్కున్నాడు. అతను పడుక్కున్న పావుగంటకు సావిత్రి లేపింది.

"మీ ఫేవరేట్ టీవీ సీరియల్ మిస్ అవుతుందని భయపడకండి. పక్కింటావిడని రిక్వెస్ట్ చేస్తే, వాళ్ల వీసీఆర్లో రికార్డు చేసిపెడతానంది. సినిమా నుంచి వచ్చాక అది చూద్దాం. త్వరగా తెమలండి. ఆలస్యమయితే కార్నర్ సీట్లు దొరకవు" అని తొందరపెట్టింది. తన మనసులో ఉన్నది సావిత్రికెలా తెలిసిందాని తికమకపడుతూనే రాజా గబగబా తయారయ్యేడు.

రెండు రోజుల తర్వాత రాజా ఆఫీసు నుండి ఆలస్యంగా వచ్చాడు. తలకాయ పగిలిపోతోందని బట్టలు కూడా మార్చుకోకుండా వచ్చి మంచంమీద వాలిపోయేడు. కాసేపటికి కంచంలో అన్నం పెట్టుకుని వచ్చింది సావిత్రి.

"మీరు ఆలస్యంగా ఎందుకొచ్చారని అడగను లెండి; తలనెప్పి అని చెప్పకుండా భోజనం చేయండి" అంది.



ఇక రాజా ఉండబట్టలేకపోయాడు.

"థాట్ రీడింగ్ ప్రాక్టీస్ చేస్తున్నావా?" అని అడిగాడు.

"నీవు నేర్పిన విద్యయే నీరజాక్షా'' అంది సావిత్రి చిరునవ్వు నవ్వుతూ.

"కొంపదీసి... నువ్వు.. మెడికల్ షాపతను..."

సావిత్రి పకపక నవ్వింది. "భాబా, భబా, బ్బె, బ్బె, బ్బె..." అని నాలిక బయటపెట్టి వెక్కిరించింది. రాజా కూడా నవ్వుతూ ఆమెను అమాంతం మీదకు లాక్కున్నాడు.

మర్నాడు సాయంత్రం రాజా సావిత్రి దిండు కింది మీటరు తీసేద్దామని వెతికితే ఎక్కడా కనబడలేదు, చూసావాని సావిత్రిని అడిగాడు.

"రెండు మీటర్లు కలిపి ఓ పెట్లో పడేసి పుస్తకాల గూట్లో పెట్టా" అంది సావిత్రి.

"బుద్ధి లేదూ, పెట్టి జారిపడితే, రెండూ విరుగుతాయి. బోల్డంత డబ్బు పోసికొన్నాం."

"నా కెక్కడ నుంచి వస్తుందిలెండి బుద్ధి! పెళ్లాలమీద పత్తేదారీ చేసేవాళ్లకుంటుంది కానీ..."

"పత్తేదారీ చేయకపోతే ఛస్తారా, చీటికిమాటికి లేని రోగాలు నటిస్తూంటే..."

దానాదీనా మాటా, మాటా పెరిగింది. పోట్లాటయింది. ఆ రాత్రి సావిత్రి తలనొప్పని పడుకుంది.

రాజాకు అనుమానం వచ్చింది. ఇది నిజందా? ఉత్తుత్తిదా? అని. భాబా మీటరు వెతుక్కునివచ్చి సావిత్రి దిండు కింద రహస్యంగా పెట్టాడు. పదినిమిషాల తర్వాత పైకి తీసి మెసేజ్ చదివాడు.

– 'ఆ భబా మీటరుతో బాటు నన్నెందుకు పెట్టారు? అదొట్టి మగమీటరు! దానిమీద అలిగాను. నాకే తలనొప్పిగా ఉంది. డిస్టర్బ్ చేయకండి' అని ఉంది.

(విపుల జూన్ 1998 )

